APTEL/2008/28200

## వరంగల్ లో ప్రశాంతంగా పోలింగ్

వరంగల్ : ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పోలింగ్ జరుగుతుంది. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులంతా తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యంలో సరైన నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ములుగు జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం ప్రారంభం కాగా. పోలింగ్ జరిగే ప్రాంతంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పోలింగ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. ఉత్సాహంగా పోలింగ్ లో పట్టభద్రులు పాల్గొంటున్నారు. తొలిసారి గ్రాడ్యుయేషన్ అయిపోయిన తర్వాత ఓటు రావడంతో ఉత్సాహంగా ఓటు వేసేందుకు యువత తరలివస్తున్నారు.

# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం

## మరో ఏడాది పాటు గుట్కా నిషేధం

హైదరాబాద్, మే 27 : రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యానికి హానికరమైన గుట్కాను నిషేధించాలని నిర్ణయించింది. ఈ మేరకు గుట్కా తయారీ, అమ్మకాలను నిషేధిస్తూ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24 నుంచి ఏడాది కాలం పాటు వీటిపై నిషేధం, నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు.. గుట్కా, పాన్ మసాలాల్లో ఉండడంతో వాటిని నిషేధించినట్లు ఉత్తర్వులు పేర్కొన్నారు. నిబంధనలు మీరి గుట్కా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటు, రాష్ట్రంలోని పలు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అపరిశుభ్రత, నిల్వ ఉంచిన ఆహారం గుర్తించి ఆయా హోటళ్ల నిర్వాహకులపై చర్యలు చేపట్టారు. అటు, కరీంనగర్‌లోని పలు హోటళ్లపైనా ఆదివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. వరంగల్ నుంచి వచ్చిన టాస్క్ ఫోర్స్ సేఫ్టీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీతో పాటు.. పలువురు అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు.

సంపుటి: 16 సంచిక : 27 కరీంనగర్ మంగళవారం, మే 28, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

## పోలీసులకు డేట్.. టైమ్.. చెప్పిన ప్రజ్వల్



బెంగళూరు, మే 27: రాసలీలల పెన్ డ్రైవ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీ(ఎస్) నేత, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తొలిసారి స్పందించారు. ఈ కేసులో మే 31వ తేదీ ఉదయం 10.00 గంటలకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు హాజరవుతానని ప్రజ్వల్ సోమవారం స్పష్టం చేశారు. ఈ కేసులో తాను పోలీసులకు సహకరిస్తానన్నారు. తనకు న్యాయవ్యవస్థలపైన చట్టాలపైన నమ్మకం ఉందని తెలిపారు. అయితే తనపై తప్పుడు కేసుల పెట్టారంటూ ప్రజ్వల్ ఈ సందర్భంగా ఆరోపించారు. అలాగే ఈ ఆరోపణలన్నీ రాజకీయ కుట్రలో భాగంగానే వచ్చినవేనన్నారు. జేడీ(ఎస్) నాయకులు, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా ప్రజ్వల్ క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ప్రజ్వల్ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల జరుగుతున్న వేళ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన రాసలీలల పెన్ డ్రైవ్ బహిర్గతమైంది. దాంతో కర్ణాటకలో రాజకీయ దుమారం రేగింది. అదీకాక ఈ ఎన్నికల్లో జేడీఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకొని లోక్‌సభ ఎన్నికలకు వెళ్లింది. దీంతో ఆ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజ్వల్ అంశం ప్రచారాస్త్రంగా మారింది. అలాగే ప్రజ్వల్‌తోపాటు అతడి తండ్రి హెచ్ డి రేవణ్ణ బాధితులు పలువురు తనకు జరిగిన అన్యాయంపై పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రజ్వల్‌పై ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే ప్రజ్వల్ రాసలీల వీడియోలు బహిర్గతం కావడంతో.. అతడు జర్మనీ వెళ్లిపోయాడు. ఆ క్రమంలో జేడీఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ప్రధాని దేవగౌడ్ కుటుంబంపై విమర్శలు వెల్లువెత్తాయి. అలాంటి వేళ దేవగౌడ.. తన మనవడు ప్రజ్వల్‌కు బహిరంగ లేఖ రాసి.. ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ప్రజ్వల్ ఎక్కడ ఉన్నా వెంటనే తిరిగి రావాలి, ఈ కేసులో పోలీసుల ఎదుట హాజరు కావాలన్నారు. అంతేకాదు.. ఈ కేసు విషయంలో తన సహనాన్ని పరీక్షించవద్దంటూ ప్రజ్వల్‌కు దేవగౌడ చురకలంటించారు. అలాగే ప్రజ్వల్‌పై ఆరోపణల నేపథ్యంలో గత కొన్ని వారాలుగా తమ కుటుంబం ఆవేదన అనుభవిస్తుందని దేవగౌడ ఈ సందర్భంగా వెల్లడించిన విషయం విధితమే. అయితే ప్రస్తుతం ప్రజ్వల్ ఎక్కడ ఉన్నది ఇంకా తెలియరాలేదు.

# 2 జూన్ 2024 నుంచి హైదరాబాద్ తెలంగాణకు మాత్రమే రాజధాని

## ఇటు సీఎం రేవంత్ ఆదేశాలు - అటు ఏపీ నేతల డిమాండ్

## పదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు

హైదరాబాద్, మే 27 : ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తోంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో తెలిపినట్లు పదేళ్లకు మించకుండా ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉండాలన్న గడువు జూన్ 2తో ముగియనుంది. 2 జూన్ 2024 నుంచి హైదరాబాద్ తెలంగాణకు మాత్రమే రాజధానిగా ఉంటుంది. 2014లో ఆంధ్రప్రేశ్ రాష్ట్ర విభజన జరిగినా.. ఏపీ, తెలంగాణ మధ్య ఆస్తుల పంపిణీ ఇంకా పూర్తి కాలేదు. విభజన సమయంలో ఇచ్చిన హామీలు సైతం పూర్తిగా అమలు కాలేదు.. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల మధ్య భిన్నమైన వాదనలు తెరపైకి వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యమివ్వడంతో.. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని ఏపీకి చెందిన కొందరు నేతలు కేంద్రంపై ఒత్తిడి పెంచారు. హైదరాబాద్‌ను తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఉంచే నిబంధనను ఏపీ ప్రభుత్వం ఖరారు చేసే వరకు కేంద్రం జోక్యం చేసుకోవాలని, దానిని పొడిగించాలని మాజీ ఐపీఎస్ అధికారి, భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు వీవీ లక్ష్మీనారాయణ కేంద్రాన్ని కోరారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా ఒప్పించాలని ఏపీలోని ఇతర పార్టీలను లక్ష్మినారాయణ కోరారు. 2034 వరకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను ఉంచాలని ఏపీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ ఇటీవల డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.


సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

కాగా.. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా గడువు ముగుస్తున్న నేపథ్యంలో తెలంగాణలో ఏపీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని భవనాలను స్వాధీనం చేసుకోవాలని, ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న ఆస్తుల పంపకాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో ఏపీకి చెందిన పలువురు నేతలనుంచి ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ను మరింత కాలం పెంచాలన్న డిమాండ్ వినిపిస్తుండటంతో కేంద్రం నిర్ణయం ఎలాఉండనుంది అనేది ఆసక్తికరంగా మారింది



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తవుతోంది. రాష్ట్ర విభజన 2014లోనే జరిగినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా పదేళ్ల పాటు హైదరాబాద్ కొనసాగింది. ఉమ్మడి గడువు మరో నాలుగు రోజుల్లో పూర్తి కానుంది. విభజన సమయంలో హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన భవనాలు జూన్ 2 తరువాత తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. దీంతో ఇక నుంచి హైదరాబాద్‌తో ఏపికి ఎటువంటి అధికారిక, పరిపాలన సంబంధం ఉండదు. హైదరాబాదులో ఉండే భవనాలకు సంబంధించిన వివరాలతో కూడా నివేదిక తయారు చేయాలని గతంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు కూడా. ఇటీవలి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన భవనాల స్వాధీనంపై కీలక ఆదేశాలు జారీ చేశారు.

## పార్టీల హామీలపై సుప్రీంకోర్టు సంచలన కామెంట్స్



న్యూఢిల్లీ: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన కామెంట్స్ చేసింది. పార్టీలు ఇచ్చే హామీలు అవినీతిగా పరిగణించలేమని స్పష్టం చేసింది సుప్రీం ధర్మాసనం. ఎన్నికల్లో పార్టీలు చేసే వాగ్ధానాలు అవినీతి కిందకు రాదని తెలిపింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన కామెంట్స్ చేసింది. పార్టీలు ఇచ్చే హామీలు అవినీతిగా పరిగణించలేమని స్పష్టం చేసింది సుప్రీం ధర్మాసనం. ఎన్నికల్లో పార్టీలు చేసే వాగ్ధానాలు అవినీతి కిందకు రాదని తెలిపింది. హామీలు ఇవ్వడమే అవినీతికి కిందకు వస్తుందంటూ సుప్రీంకోర్టులో కొందరు పిల్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. పిల్‌ను విచారణకు అంగీకరించలేదు. పార్టీల మేనిఫెస్టోల్లోని హామీలను ప్రజలు నమ్మితే ఎవరేం చేస్తారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దీనిని అవినీతిగా పరిగణించలేమని పిల్‌ను తోసిపుచ్చింది. రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలను అవినీతిలో భాగంగా పరిగణించాలని కోరుతూ కొందరు సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. రాజకీయ పార్టీలు అధికారం చేపట్టేందుకు అలవిగాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని.. వీటి కారణంగా ప్రజలు ప్రలోభాలకు గురవుతున్నారని పిల్‌లో పేర్కొన్నారు. ఇష్టారీతిన మేనిఫెస్టోలు, హామీలు ఇచ్చి.. అధికారం చేపట్టిన తరువాత వాటిని విస్మరిస్తున్నారని అన్నారు. ఈ కారణంగా రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు కూడా అవినీతికి కిందకే వస్తాయని.. వీటిపై తగిన ఆదేశాలు ఇవ్వాలని పిల్‌లో కోరారు. దీనిని పరిశీలించిన ధర్మాసనం.. పిల్‌ను తిరస్కరించింది

## 'ఆప్'కు స్వాతి మలివాల్ రాజీనామా చేస్తారా..?



న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ తనపై దాడి చేశారనే ఆరోపణలతో సంచలనం సృష్టించిన ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ సొంత పార్టీకి రాజీనామా చేస్తారా? ఆమె తదుపరి కార్యాచరణ ఏమిటి?. ఈ ప్రశ్నలకు స్వాతి మలివాల్ ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమాధానమిచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీకి తాను రాజీనామా చేయనని, అది (పార్టీ) ఇద్దరు ముగ్గురు వ్యక్తులకు చెందినది కాదని ఆమె తెలిపారు. దాడి ఘటన అనంతరం బీజేపీకి చెందిన ఎవరూ తనను కలవలేదని కూడా ఆమె వివరణ ఇచ్చారు. "నేను నిజం మాట్లాడకపోతే, నాకూ పార్టీకి మధ్య సంబంధాలు సజావుగానే ఉండేవి కావచ్చు. నన్ను దారుణంగా కొట్టినా దేశంలో అతిపెద్ద ఎన్నికలు జరుగుతుండటం, దీనిని రాజకీయం చేసే అవకాశం ఉందన్న కారణంగా నన్ను నేను నిగ్రహించుకున్నాను. ఎంత కంట్రోల్ చేసుకోవాలనుకున్నా చివరకు మరో మార్గం లేకపోయింది. బాధితురాలిని అమానించడం ద్వారా మొత్తం మహిళా ఉద్యమానికే కీడు తలపెట్టారు. నేను పార్టీలోనే ఉన్నాను. ఎందుకంటే పార్టీ ఇద్దరు ముగ్గురు వ్యక్తులకు చెందినది కాదు. పార్టీకి చమటోడ్చి మరీ పనిచేసాను" అని స్వాతి మలివాల్ తెలిపారు. రాజ్యాంగ పదవిలో ఉన్నందున లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సెనా మాత్రమే తనతో మాట్లాడారని, ఏమి జరగిందని ఆరా తీయడంతో పాటు పోలీసులతో డీల్ చేసే విషయంలో సమస్యలు ఎదురయ్యాయా అని అడిగారని స్వాతి మలివాల్ చెప్పారు. అరవింద్ కేజ్రీవాల్ తనకు ఇంతవరకూ ఫోన్ చేయలేదని ఆదివారంనాడు మరో ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. ఆయన ప్రమేయం ఇందులో(ఘటనలో) లేదని తాను బలంగా నమ్ముతున్నానని చెప్పారు. ఇంతవరకూ తాను పోలీస్ కంప్లెయింట్ ఇవ్వలేదని, తమ మధ్య రిలేషన్ యధాతథంగా ఉందని అన్నారు. అయితే ఆయన ఆలోచన ఏమిటో తాను తెలుసుకోవాలనుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటివరకూ అయితే ఎవరికీ తాను క్లీన్ చిట్ ఇవ్వలేదని చెప్పారు.

## ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా



న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటీషన్లపై ఢిల్లీ హైకోర్టులో సోమవారం విచారణ కొనసాగింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీల్యాండరింగ్ కేసులో కవితకు బెయిల్ ఇవ్వాలని ఆమె తరపు న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. 40 నిముషాల పాటు కవిత తరపు విక్రమ్ చౌదరి కోర్టులో వాదనలు వినిపించారు. నిబంధనలకు విరుద్ధంగా కవిత అరెస్టు జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన శరత్ రెడ్డికి బెయిల్ ఇచ్చారని, ఈ కేసులో మాగుంట శ్రీనివాసులు కవితకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చారని కోర్టుకు వివరించారు. శరత్ రెడ్డి 55కోట్లు ఎలక్ట్రోరల్ బాండ్స్ రూపంలో బీజేపీకి విరాళం ఇచ్చారని, శ్రీనివాస్ రెడ్డి ఎన్డీయే అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేశారని కోర్టు దృష్టికి విక్రమ్ చౌదరి తీసుకెళ్లారు. గత ఏడాది సెప్టెంబర్ లో సుప్రీంకోర్టు నిబంధనలు ఉల్లంఘించి కవితను అరెస్టు చేసినట్లుగా కోర్టుకు తెలిపారు. విక్రమ్ చౌదరి బాగా వాదనలు వినిపించారని జడ్జి స్వర్ణకాంత శర్మ అభినందించారు.

## రఫాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు 35 మంది పాలస్తీనియన్లు మృతి



దక్షిణ గాజా నగరమైన రఫాపై సైనిక దాడులను వెంటనే నిలిపివేయాలన్న అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) ఆదేశాలను ఇజ్రాయెల్ బేఖాతరు చేసింది. రఫాపై దాడులను మరింత పెంచేసింది. నగరంలోని పలు లక్ష్యాలను బాంబులతో నాశనం చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ప్రణాళికలు చేపట్టింది. ఇందులో భాగంగానే రఫాపై ఆదివారం విరుచుకుపడింది. నివాసితులు ఉంటున్న గుడారాలపై వరుసగా బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 35 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ తాజాగా వెల్లడించింది. డజన్ల కొద్దీ ప్రజలు గాయపడినట్లు తెలిపింది. మృతుల్లో చాలా మంది మహిళలు, చిన్నారులు ఉన్నట్లు తెలిపింది. మృతులు, గాయపడిన వారిని తీసుకెళ్లేందుకు రఫాలో సరిపడా సామర్థ్యం ఉన్న ఆసుపత్రులేవీ లేవని పేర్కొంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. కాగా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసిన ప్రాంతం వలసదారులతో కూడిన క్యాంప్ అని పాలస్తీనా రెడ్ క్రిసెంట్ సొసైటీ వెల్లడించింది.

## తెలంగాణలో ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక



హైదరాబాద్, మే 27 : తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సోమవారం పోలింగ్ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు అధికారులు. మూడు ఉమ్మడి జిల్లాల్లో 34 అసెంబ్లీ స్థానాల పరిధిలో పోలింగ్ జరిగింది. జూన్ 5వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ జరగనుంది. ఈ ఎన్నిక బరిలో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్), బీఆర్ఎస్ నుంచి రాకేష్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డి ఉన్నారు. మొత్తంగా 52 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో నిలిచారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 4 గంటల వరకే 60 శాతం పోలింగ్ దాటింది. ఇంకా క్యూలైన్లలో చాలా మంది అభ్యర్థులు ఉన్నారు. వారి ఓటింగ్ పూర్తయితే.. పోలింగ్ శాతం మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే, 4 గంటల లోపు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను నల్లగొండ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నిక ఫలితాలను జూన్ 5వ తేదీన వెల్లడించనున్నారు

## గ్యారేజీకి మేడిగడ్డ



కరీంనగర్, మే 27 : తెలంగాణ ప్రాణంగా బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ బీఆర్ఎస్ అధికారంలో ఉండగానే కుంగింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఇదీ ఒక కారణం. బ్యారేజీలోని 7వ బ్లాక్ కుంగి దాదాపు పది నెలలు కావస్తోంది. ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడంతో ఇప్పుడు 7వ బ్లాక్ మరమ్మతులపై కాంగ్రెస్ సర్కార్ దృష్టిపెట్టింది. ఈ క్రమంలో కుంగిన గేట్లను ఎత్తే ప్రయత్నం చేస్తోంది. తాజాగా బుధవారం 7వ బ్లాక్‌లోని 16వ నంబర్ గేటు ఎత్తుతుండగా భూగర్భంలో పెద్ద శబ్దాలు వినిపించాయి. ప్రకంపనలు కూడా వచ్చాయి. దీంతో పనులు ఆపేశారు. పెద్ద శబ్దాల వెనుక ఏం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఏడవ బ్లాక్ పియర్ కింద భారీ బుంగ పడి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. దాని కారణంగానే గేటు ఎత్తుతుండగా శబ్దాలు వస్తున్నాయని భావిస్తున్నారు. గతంలో వచ్చిన వరదల కారణంగా బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయిందని బావిస్తున్నారు. దీనికారణంగా 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో భారీ బొరియ ఏర్పడి ఉండొచ్చని జియో ఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల ద్వారా అంచనావకు వచ్చారు. ఈ క్రమంలో టన్నులకొద్దీ బరువు ఉండే గేటు ఎత్తుతున్న క్రమంలో పునాదులపై ఒత్తిడి పడి శబ్దాలు వస్తున్నాయని పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితిలో గేట్లు ఎత్తడం మంచిది కాదని ఇంజినీర్లు భావిస్తున్నారు. పునాదుల కింద ఏర్పడిన ఖాళీలు పూడ్చిన తర్వాతనే గేట్లు ఎత్తాలని నిర్ణయించారు. ఇప్పటికే నీటి లీకేజీలను ఆపేందుకు బ్యారేజీ కుంగిన వెంటనే 40 వేల ఇసుక బస్తాలు వేశారు. అయినా ఇప్పటికీ భారీ ఖాళీ ఉందని భావిస్తున్నారుమేడిగడ్డ బ్యారేజీ దిగువన ఇసుక కొట్టుకుపోవడంతో ఏర్పడిన ఖాళీ ప్రదేశం, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉందన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కుంగిన ఏడు నంబర్ బ్లాక్ దిగువకే ఈ బొరియ పరిమితమై లేదని, మొత్తం బ్యారేజీ కింద ఖాళీ ప్రదేశం ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. దీనిపై స్పష్టత వచ్చాక నిపుణుల కమిటీ సూచన మేరకు ఇసుక, సిమెంటు మిశ్రమాన్ని పంపించి పూడ్చివేయాల్సి ఉంటుంది.

## మణికొండ రెండవ రోజు కొనసాగుతున్న కూల్చివేతలు



**రంగారెడ్డి మే** మణికొండ మునిసిపల్ కార్పొరేషన్ లో రెండవ రోజు కూల్చివేతలు కొనసాగుతున్నాయి. పంచవటి కాలనీ, పుప్పాల్ గూడ లో అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఆగ్రహంగా ఉన్నారు. భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ముఖ్య మంత్రి కార్యాలయం నుండి మునిసిపల్ అధికారులకు బిల్డర్స్ ఒత్తడి చేయిస్తున్నట్టు సమాచారం. అక్రమ నిర్మాణాల కూల్చివేతలను ఆపడం లేదని అధికారులు తేల్చి చెప్పారు.

## తెలంగాణలో మళ్లీ మండుతున్న ఎండల



**హైదరాబాద్ మే :** తెలంగాణలో మళ్లీ ఎండలు మండుతున్నాయి. శుక్రవారం సాధారణం కంటే 2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా నేరెళ్లలో అత్యధికంగా 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత, మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో 44.9, హాజీపూర్‌లో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని అధికారులు వెల్లడించారు. మళ్లీ ఎండలు మండిపోవడంతో జనాలు బయటకు రావాలంటే వణికిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జనాలు ఎండలో తిరగవద్దని వైద్యులు సూచిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజులు కిత్రం వరకు వర్షాలు కురిశాయి. ఇప్పుడు మళ్లీ ఎండలు దంచి కొడుతుండడంతో జనాలు బయటకు రావాలంటే బెంబేలెత్తుతున్నారు.

## మొదటి ఓటు వేసిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



**సూర్యాపేట:** వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా సూర్యాపేట జూనియర్ కళాశాలలోని 457వ బూత్ లో మొట్ట మొదటగా ఓటు వేసి.. మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బూత్ లో మొత్తం 673 ఓటర్లు ఉండగా జగదీష్ రెడ్డి పోలింగ్ ప్రారంభ సమయానికి వచ్చి మొట్టమొదట గా ఓటు వేసారు.

## ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన ఎమ్మెల్యే సబిత



**రంగారెడ్డి:** బడంగ్ పేట్ , మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీ నిర్మాణంలో ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలను మాజీ విద్యా శాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. పాఠశాలలు జూన్ నెలలో తిరిగి రీ ఓపెన్ అవుతున్న సందర్భంగా నిర్మాణంలో ఉన్న వివిధ పాఠశాలలను అధికారులు స్థానిక కార్పొరేటర్ తో కలిసి పరిశీలించారు. గత ప్రభుత్వం హయాంలో మెగా ప్రాజెక్ట్ సిఎస్ఆర్ కింద 12 కోట్లతో మూడు స్కూల్ బిల్డింగ్లను ప్రారంభించిన మెగా సంస్థ, అందులో భాగంగా వివిధ పాఠశాలను పనులను అధికారులు కాంటాక్ట్ ల ద్వారా అడిగి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బడంగ్ పెట్ ప్రభుత్వ పాఠశాలను ఇక్కడకి తరలించి. పాత ప్రభుత్వ పాఠశాలలో గవర్నమెంట్ హాస్పిటల్ నిర్మిస్తామని అన్నారు.

## నకిలీ విత్తనాల కట్టడికి జాయింట్ టాస్క్ ఫోర్స్ బృందాలు

### క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణపోలీస్ కమిషనర్ బి. అనురాధ



**సిద్దిపేట**నకిలీ, కల్తీ విత్తనాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ, విత్తన కార్పొరేషన్, పోలీసు బలగాలతో జాయింట్ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. వారంతా విధినిర్వహణలో నిమగ్నమై ఉన్నారని కమిషనర్ అనురాధ అన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసిన, దుకాణాలలో, ఏజెంట్లు,మధ్యవర్తుల ముసుగులో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించిన తీవ్రమైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా నకిలీ విత్తనాల విక్రయాలలో గతంలో కేసులు నమోదైన వారిపై నిఘా వుంటుందన్నారు. తరచూ కేసులు నమోదైతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు.ప్రధానంగా గుర్తింపు పొందిన విత్తన దుకాణాల్లో విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఏ ప్రాంతంలోనైనా కచ్చితమైన కంపెనీ పేరు, బిల్లులు లేకుండా విడిగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే స్దానిక పోలీస్ స్టేషన్ కు కాని, మండల వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసిరకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు.టాస్క్ ఫోర్స్ బృందాలు జిల్లా పరిధిలోని విత్తన ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.నకిలీ విత్తనాల సమస్యలను నియంత్రించేందుకు ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సమాచారం వ్యవస్థను పటిష్టం చేసినట్లు తెలిపారు. దీనికి తోడు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణా జరిగే ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్టు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి దుకాణాదారు నుంచి రశీదు తీసుకోవాలన్నారు. పట్టణాలలో, మండలల్లో టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలియజేసారురైతు దేశానికి వెన్నెముక అని ఆరుగాలం కష్టించి దేశం కడుపు నింపే రైతులను మోసం చేస్తూ దళారులు కొంతమంది నకిలీ విత్తనాలు సరఫరా చేసి రైతులను అప్పుల అగాధంలోకి నెట్టబడుతున్నారని వారి కుటుంబాలను ఆర్థికంగా చిన్నాభిన్నం చేస్తున్న నకిలీ విత్తనాల సరఫరా, నాసిరకం ఎరువులు కొనుగోలు మరియు విక్రయాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తూ పక్కా సమాచారంతో ఎవరైనా నకిలీ విత్తనాల సరఫరా, విక్రయాలు జరిపితే వారిపై దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, వ్యాపారస్తుల నుంచి తీసుకున్న బిల్లులు కూడా జాగ్రత్తగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను నియమించామని వారి ద్వారా మండలాల వారీగా వ్యవసాయ అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహిస్తామని తెలిపారు. నకిలీ విత్తనాలను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేశామని తెలిపారు.నకిలీ విత్తనాలను, ఎరువులు, నాసిరకం పురుగుల మందులను ముందుగా గుర్తించడం అడ్డుకోవడం కట్టడి చేయడం, వారు ఎక్కడి నుండి సరఫరా చేస్తున్నారు ప్రైమరీ కాంటాక్ట్, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పోలీసు అధికారులు వ్యవసాయ రైతులకు అవగాహన కార్యక్రమలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పట్టణాలలో గ్రామాలలో ఎవరైనా తక్కువ ధరకు పత్తి విత్తనాలు కానీ ఇంకా ఏమైనా విత్తనాలు కానీ ఇస్తామని మాయమాటలు చెప్పి విక్రయించడానికి వచ్చిన వారి వివరాలను వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని లేదా డయల్ 100, సిద్దిపేట కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ వాట్సాప్ నెంబర్ 8712667100. సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445. 8712667446. 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.

## తెలుగు నటీనటులకు నార్కో టెస్టులు

**హైదరాబాద్ , మే** బెంగళూరు రేవ్ పార్టీ డ్రగ్స్ కేసు టాలీవుడ్‌లో అలజడి రేపుతుంది. ఇప్పటికే డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డ 86 మందిలో అత్యధికంగా తెలుగు వారే ఉండటం, అందులోను సినిమా ఇండస్ట్రీ వారు ఎక్కువగా ఉండటంతో సాధారణంగానే ఈ కేసుపై ఇండస్ట్రీ సైతం కన్నేసి ఉంచింది. అయితే ఈసారి ఇండస్ట్రీ డ్రగ్స్ లింకులు బెంగళూరు వరకు వెళ్ళాయని అనుమానిస్తున్నారు. రాష్ట్ర పోలీసులు కూడా బెంగుళూరు పార్టీని చాలా సీరియస్‌గా గమనిస్తున్నారు.బెంగళూరు రేవ్ పార్టీ వ్యవహారంలో పోలీసుల నెక్ట్స్ స్టెప్ చాలా కీలకంగా మారనుంది. సాధారణంగా మన దగ్గర డ్రగ్స్ కేసులలో ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే వారిని బాధితులుగా మాత్రమే పరిగణిస్తారు. కానీ బెంగళూరు లాంటి రాష్ట్రాల్లో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన సినిమా తారలను ఆ రాష్ట్ర పోలీసులు గతంలో ఎన్నోసార్లు అరెస్టులు చేసిన దాకాలు కూడా ఉన్నాయి. మరి బెంగళూరు ఫామ్ హౌస్ కేసులో పోలీసులు ఎలా ముందుకు వెళ్తారో చూడాల్సి ఉంది.తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలన కోసం ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుంది. ఇండస్ట్రీ పేర్లు ఎప్పుడు తెరమీదకి వచ్చినా, వారికి కేవలం నోటీసుల వరకు మాత్రమే విచారణ పరిమితం అవుతుంది. డ్రగ్స్ కేసులలో చట్టంలో ఉన్న కొన్ని లొసుగులు కూడా నిందితులకు సానుకూలంగా మారుతున్నాయి. డ్రగ్స్ కేసులలో శిక్ష పడటం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. కానీ డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అటు ప్రభుత్వం కానీ ఇటు పోలీసులు కానీ అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇండస్ట్రీ పేరు వచ్చిన ప్రతిసారీ తూతూ మంత్రంగా జరిగే విచారణలు కాకుండా చాలా పగడ్బందీగా చర్యలు చేపట్టాల్సిందే..!ఇండస్ట్రీకి డ్రగ్స్ కొత్త కాకపోయినప్పటికీ, మన ఇండస్ట్రీ పరువును పక్క రాష్ట్రాల్లో తీయడం ఒకరకంగా ఇండస్ట్రీకి పెద్ద మచ్చ లాంటిదే. మన రాష్ట్రంలో డ్రగ్స్ కేసులలో సినీ తారలు ఇరుక్కున్నప్పుడు ఉండే హడావిడి ఆ తర్వాత కనిపించదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీలో సినీ తారలు దొరికిన వారి శాంపుల్స్ సేకరణ, ఆ తర్వాత పాజిటివ్ వస్తే నోటీసులు, మళ్లీ విచారణ పేరుతో కాలయాపన తప్పా, ఇప్పటివరకు డ్రగ్స్ తీసుకున్నట్టు కోర్టులలో రుజువు చేయలేకపోయారన్న అపవాదు ఉంది. 2017 టాలీవుడ్ డ్రగ్స్ కేస్ తో పాటు గుడి మల్కాపూర్ డ్రగ్స్ కేస్ ఆ తర్వాత వచ్చిన రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేస్, ఈ విధంగా పలు కేసుల్లో సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన తారల పేర్లు బయట పడుతూ వచ్చాయి. కానీ ఇన్ని కేసుల్లో ఒక్క సినీ సెలబ్రిటీ కూడా జైలు పాలైన సందర్భాలు లేవన్న



వాదనలు వినిపిస్తున్నాయి.అయితే ఇప్పుడు కేసు నమోదు అయింది బెంగళూరులో కాబట్టి ఒకసారిగా సినీ ఇండస్ట్రీ కూడా అలర్ట్ అయింది.. బెంగళూరు పోలీసులు నటి హేమతో పాటు ఇండస్ట్రీకి సంబంధించిన మరికొందరికి నోటీసులు ఇవ్వనున్నారు. నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా బెంగళూరుకు వెళ్లి పోలీస్ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇదే ఇండస్ట్రీ వర్గలో హాట్ టాపిక్ గా మారింది. ఒకవేళ హేమ పోలిసుల విచారణ హాజరైతే, ఆమె ఎలాంటి విషయాలు బయటపెడుతుందనే దానిపై జోరుగా చర్చించుకుంటున్నారు. ఎందుకంటే ఇండస్ట్రీలో పార్టీ కల్చర్ వెరీ కామన్. అయితే కామన్ ఫ్రెండ్స్ ద్వారా కొందరికి పార్టీల్లో డ్రగ్స్ అలవాటు అవుతుంటుంది. మరి హేమా వ్యవహారంలో ఎవరు ఆమెకు డ్రగ్స్ అలవాటు చేశారు..? ఎప్పటి నుండి డ్రగ్స్ తీసుకుంటుంది..? ఈమె బ్యాచ్ లో ఉన్నది ఎవరు..? ఇలా అనేక విషయాలను బెంగుళూరు పోలీసులు కూపీ లాగనున్నట్లు తెలుస్తోంది. దీంతో హేమ విచారణపై ఫోకస్ పెట్టారట పలువురు కన్నడ్యామర్లు.బెంగళూరు రేవ్ పార్టీ వ్యవహారంపై తెలంగాణ నార్కోటిక్ పోలీసులు సైతం దృష్టి సారించారు. సాధారణంగా తెలంగాణలో నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఏర్పడిన తర్వాత ఎక్కడ డ్రగ్స్ మూలాలు దొరికినా, వెంటనే వాటిని ధ్వంసం చేస్తున్నారు. ఈ తరుణంలో బెంగళూరు రేవ్ పార్టీలోనూ ఎక్కడినుండి డ్రగ్స్ ఆ పార్టీకి వెళ్లాయి అనే వ్యవహారంలో హైదరాబాద్ న్నార్కోటిక్ పోలీసులు సైతం దృష్టిసారించారు.. అందులోనూ ఈ పార్టీలో దొరికింది

## 2 రోజులు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు




**హైదరాబాద్,** మేజంట నగరాల్లో నివసిస్తున్న వారికి మెట్రో కన్నా ముందు నుంచి ఎంఎంటీఎస్ మెరుగైన సేవలు అందిస్తూ వస్తోంది. మెట్రోలు అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు డిమాండ్ ఏ మాత్రం తగ్గడం లేదు. మెట్రో రైలు లేని ప్రాంతాల్లో ఎంఎంటీఎస్‌లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. పైగా మెట్రోతో పోలిస్తే.. వీటి ఛార్జీలు చాలా కూడా తక్కువే. ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారు, సాఫ్ట్ వేర్ ఎంప్లాయిస్, స్టూడెంట్స్, కూలీలు ఇలా నిత్యం చాలా మంది ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణిస్తుంటారు. వారందరికీ దక్షిణ మధ్య రైల్వే కీలక సూచన అందించింది. ఈనెల 25, 26 తేదీల్లో పలు ఎంఎంటీఎస్ రైళ్లు, 4 డెమూ సర్వీసులు రద్దు చేస్తున్నట్లు రైల్వే సంస్థ ప్రకటించింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీల (ఈూః)ల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో సికింద్రాబాద్-ఫలక్‌నువా, మేడ్చల్-సికింద్రాబాద్, లింగంపల్లి-మేడ్చల్, హైదరాబాద్-మేడ్చల్ మధ్య ప్రయాణికులకు నిత్యం సేవలందించే 22 ఎంఎంటీఎస్ సర్వీసులను క్యాన్సిల్ చేస్తున్నట్లు చీఫ్ పీఆర్వో సీహెచ్.రాకేశ్ ఓ ప్రకటనలో తెలిపారు.

## సాఫ్ట్‌వేర్ వివాహిత మర్డర్ కేసులో విస్తుపోయే వాస్తవాలు




**మే** చిన్న గొడవ నేపథ్యంలో భార్యను అత్యంత దారుణంగా కత్తితో హత్య చేశాడు ఓ భర్త.. ఆ తర్వాత మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోయాలని పథకం వేశాడు. కుదరక ఇంట్లోనే గ్యాస్ సిలిండర్ లీక్ చేసే ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత ఆత్మహత్య డ్రామా ఆడాడు. ఇదంతా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన సాఫ్ట్‌వేర్ వివాహిత హత్య కేసు. అయితే పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ మహానగరం శివారు బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసిన హత్య కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన మధులతకు అదే జిల్లాకు చెందిన నాగేంద్ర భరద్వాజ్‌తో 2020లో వివాహం జరిగింది. వారికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. మీరు బాచుపల్లిలోని సాయిల్ అనురాగ్ కాలనీలో ఎమ్మెస్సార్ ప్లాజాలో నివాసం ఉంటున్నారు. దంపతులిద్దరూ కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు.అయితే పెళ్లయిన మొదటి రోజు నుండి మొదలైన చిత్రహింసలు ఆమె మరణం దాకా కొనసాగినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. కనీసం కుమారుడు పుట్టినా, చూడడానికి కూడా వెళ్లలేదట. ఆ తర్వాత పెద్దల సమక్షంలో ఎన్నిసార్లు మాట్లాడించిన నాగేంద్ర తీరు మాత్రం మారలేదు. ఇక మే నెల 4వ తేదీన మధులతను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసి బాచుపల్లి పోలీసులకు దొరికిపోయాడు.

## ఈదురు గాలులకు ఇళ్లు ధ్వంసం



**యాదాద్రి:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామంలో రాత్రి బీభత్సమైన ఈదురు గాళ్ళతో కూడిన వర్షం రావడంతో గ్రామంలో పలు ఇల్లు ధ్వంసం అయ్యాయి. భారీగా ఈదురుగాలుల తో కూడిన వర్షం రావడంతో పలు ఇండ్ల పై కప్పులు, రేకులు, ఇంట్లో ఉన్న సామాగ్రి పూర్తిగా ధ్వంసం అయ్యాయి.... పలు ఇండ్లపై విద్యుత్ స్తంభాలు కూలడంతో ఇళ్లల్లో ఉన్నవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రాత్రి నుండి గ్రామంలో కరెంటు సరఫరా నిలిపివేసిన విద్యుత్ అధికారులు, తమ తమ ఇండ్లల్లో ఉన్న ఫ్రిడ్జ్ లు, కూలర్లు ఫ్యాన్లు, బీరువాలు వంట సామాగ్రి బియ్యం గాలివానకు నెలపాలయ్యాయి.. ఈ గాలివాన బీభత్సానికి లక్షల రూపాయలు నష్టపోయామని తమని ఆదుకోవాలని ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు...

## మేడిగడ్డ బ్యారేజీ ఏడవ బ్లాకులో భారీగా ఏర్పడిన గుంత గుంతలో నుంచి ఉబికి వస్తున్న నీరు



**భూపాలపల్లి:** మేడిగడ్డ బ్యారేజి ఏడవ బ్లాక్ లో భారీ గుంత ఏర్పడింది. గుంతనుంచి నీరు రావడంతో ఇంజనీరింగ్అధికారులు మట్టి మరియు ఇసుకతో ఆ గుంతను పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఏడవ బ్లాక్ కుంగిన పియర్స్ దగ్గర 6 మీటర్ల పొడుగు, రెండు మీటర్ల వెడల్పు తో గుంత ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో బ్యారేజీ కి సంబంధించిన తప్పిదాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండడంతో అయోమయంలో పడిపోతున్నారు ఇంజనీరింగ్ అధికారులు. ఏడవ బ్లాక్ లోనే బొరియలు ఏర్పడ్డాయా.... లేక మిగతా బ్లాక్ లలో కూడా బొరియలు ఉన్నాయా అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. గతంలోనే బ్యారేజ్ కి ప్రమాదం పొంచి ఉన్నట్టుగా గుర్తించి ముందుగానే హెచ్చరించిన నేషనల్ డ్యాన్స్ సేఫ్టీ అథారిటీస్ చంద్రశేఖర్ అయ్యర్ కమిటీఏర్పాటు చేసింది.

## అమెరికాలో నల్గొండవాసి మృతి

హైదరాబాద్, మే 27 : ఇటీవల కాలంలో విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు పలు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. తాజాగా అమెరికాలోని ఫ్లోరిడాలో భారతీయ యువతి చనిపోయింది. ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సౌమ్య (25) మృతి చెందింది. యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలోని యాదగిరిపల్లికు చెందిన కోటేశ్వరరావు సిఆర్పిఎఫ్ జవాన్?గా పనిచేశాడు. యాదగిరిపల్లెలో చిన్న కిరాణా షాపు నడుపుకుంటూ కూతురు, కొడుకును చదివించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు సౌమ్య చదువులో చురుకుగా ఉండేది. రెండేళ్ల క్రితం అమెరికాలోని ఫ్లోరిడా అట్లాంటిక్ యూనివర్సిటీలో సౌమ్యకు ఎమ్మెస్‌లో సీటు వచ్చింది. కూతురు చదువు కోసం కోటేశ్వరరావు అప్పులు చేసి అమెరికా పంపించాడు. ఎమ్మెస్ పూర్తి చేసిన సౌమ్య కన్సల్టెన్సీ ద్వారా జాబ్ సెర్చింగ్ చేస్తోంది. నిన్న కూరగాయల కోసం బయటికి వెళ్లిన సౌమ్యను వెనక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో సౌమ్య అక్కడికక్కడే మృతి చెందింది.సౌమ్య మృతి వార్తతో యాదగిరి పల్లెలో విషాదం నెలకొంది.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.